వాల్మీకికి ఘన నివాళులు

నెల్లూరు(పొగతోట): నగరంలోని జెడ్పీ కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

⇨ నగరంలోని డ్వామా, డీఆర్డీఏ కార్యాలయాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆ శాఖ పీడీలు గంగాభవానీ, నాగరాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని విద్యుత్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ రాఘవేంద్రం, నోడల్ ఆఫీసర్ శేషాద్రిబాలచంద్ర, ఈఈలు శ్రీధర్, అల్తాఫ్, పర్సనల్ ఆఫీసర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(క్రైమ్): నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి ఎస్పీ అజిత వేజెండ్ల పూలమాలేసి నివాళులర్పించారు. ఏఎస్పీ సౌజన్య, డీఎస్పీలు శ్రీనివాసరావు, జీ శ్రీనివాసరావు, శ్రీధర్, వేణుగోపాల్, చంద్రమోహన్, ఏఓ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.


జెడ్పీ కార్యాలయంలో..


విద్యుత్ భవన్‌లో..


జిల్లా పోలీస్ కార్యాలయంలో..

ఖాళీ స్థలాల్లో జంగిల్ క్లియరెన్స్



నెల్లూరు(బారకాసు): నగరంలోని సత్యనారాయణపురం, నేతానగర్‌లోని ఖాళీ స్థలంలో ఏపుగా పెరిగిన చెట్లతో అపరిశుభ్రత నెలకొంది. ఈ అంశమై 'ఖాళీ స్థలాలు.. అపరిశుభ్రతకు నిలయాలు' అనే శీర్షికన సాక్షిలో కథనం సోమవారం ప్రచురితమైంది. ఈ తరుణంలో జంగిల్ క్లియరెన్స్ పనులను కార్పొరేషన్ అధికారులు మంగళవారం చేపట్టారు. నేతానగర్‌లోని ఖాళీ స్థలంలో ఏపుగా పెరిగిన చెట్లు, మొక్కలను మినీ జేసీబీతో తొలగించారు.

సాక్షి ఎఫెక్ట్..

కంటైనర్ తొలగింపు

నెల్లూరు సిటీ: నగరంలోని మినీబైపాస్‌లో రోడ్డును ఆక్రమించి కంటైనర్‌ను టీడీపీ నేత అనుచరులు సోమవారం ఏర్పాటు చేసి.. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ క్రమంలో 'తీసే దమ్ముందా' అనే శీర్షికన సాక్షిలో కథనం మంగళవారం ప్రచురితమైంది. దీంతో కార్పొరేషన్ అధికారులు స్పందించి.. కంటైనర్‌ను జేసీబీతో అక్కడి నుంచి తీయించారు.



మున్సిపల్ కార్మికుల ధర్నా



నెల్లూరు(బారకాసు): హామీ మేరకు పారిశుధ్య కార్మికులకు సమ్మె కాలం నాటి జీతాలివ్వాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయం నుంచి ములుమూడి బస్టాండ్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ, ధర్నాను ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కత్తి శ్రీనివాసులు, సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నెల్లూరు నగరాధ్యక్ష, కార్యదర్శులు మనోజ్‌కుమార్, అశోక్ మాట్లాడారు. సమ్మె కాలం నాటి జీతాలను ఇవ్వని కారణంగా కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇదే విషయాన్ని కమిషనర్‌కు తెలియజేసినా, కాలయాపన చేస్తుండటం తగదని చెప్పారు. 60 ఏళ్లు నిండాయనే నెపంతో 93 మంది కార్మికులను నిర్దాక్షిణ్యంగా నిలిపేశారని ఆరోపించారు. నగరపాలక సంస్థలో ప్రైవేట్ కాంట్రాక్టర్లకు పెద్దపీట వేస్తూ ప్రజాధనాన్ని భారీగా దుర్వినియోగం చేస్తున్నారని చెప్పారు. స్వచ్ఛాంధ్ర పేరుతో పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంటూ.. కార్మికుల సమస్యలను గాలికొదిలారని ఆరోపించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనను చేపడతామని స్పష్టం చేశారు. డీవైఎఫ్ఐ నెల్లూరు నగర కార్యదర్శి నరసింహ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నెల్లూరు నగర నేతలు మట్టిపాటి శ్రీనివాసులు, తాళ్లూరి లోకేష్, జయకుమార్, చంద్రమ్మ, రాంబాబు, షబ్బీర్, షఫీ, రమేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజానికి కృషి



నెల్లూరు(అర్బన్): టీబీ రహిత సమాజం కోసం ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా టీబీ, ఎయిడ్స్, లెప్రసీ నివారణాధికారి ఖాదర్‌వలీ సూచించారు. స్థానిక పీసీనాయుడి వీధిలోని అర్బన్ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకల్లేకపోవడం, బరువు తగ్గిపోవడం, రాత్రి పూట చెమటలు పట్టడం లాంటి లక్షణాలుంటే, వారికి గళ్ల పరీక్ష కేంద్రంలో టీబీ నిర్ధారణ పరీక్షలను చేయించాలని సూచించారు. అనంతరం లెప్రసీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించి.. చేపట్టాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

జోరుగా మట్టి అక్రమ తవ్వకాలు


మట్టిని తరలిస్తున్న టిప్పర్

నెల్లూరు సిటీ: కల్లూరుపల్లిలోని మూడున్నరెకరాల ప్రభుత్వ స్థలంలో గుట్టుచప్పుడు కాకుండా మట్టిని అక్రమంగా టీడీపీ నేత అనుచరులు యథేచ్ఛగా తవ్వుతున్నారు. 'డబ్బే ముఖ్యం.. ప్రాణాలు కాదు' అనే శీర్షికన సాక్షిలో కథనం గత నెల 19న ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి.. తవ్వకాలను నిలిపేయించారు. అయితే రెండు రోజుల నుంచి వ్యవహారాన్ని జోరుగా సాగిస్తున్నారు. సమీపంలోని ఓ లేఅవుట్‌కు మట్టిని విక్రయించారు.

ప్రభుత్వ స్థలంలో ఎలాంటి అనుమతుల్లేకుండా తవ్వకాలు జరపడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బంగారు కాసులు అందజేత

పొదలకూరు: మండలంలోని మొగళ్లూరు గ్రామంలో ఉన్న భద్రకాళమ్మ దేవస్థానంలో అమ్మవారికి బంగారు కాసులను రాజారెడ్డి, సుకన్య దంపతులు మంగళవారం బహూకరించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు పొంగళ్లు పెట్టుకొని నైవేద్యాన్ని సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పశు వైద్యశిబిరం రేపు

నెల్లూరు సిటీ: కందమూరులో పశు వైద్యశిబిరాన్ని గురువారం నిర్వహించనున్నామని కొత్తవెల్లంటి పశు వైద్యాధికారి హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆటో అపహరణపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఆటో అపహరణపై కేసును చిన్నబజార్ పోలీసులు నమోదు చేశారు. వివరాలు.. దగదర్తి మండలం దామవరానికి చెందిన మల్లికార్జున ఆటో నడుపుకొని జీవనం సాగిస్తున్నారు. తన తాత ఆరోగ్యం సక్రమంగా లేకపోవడంతో ఆటోలో నెల్లూరుకు ఈ ఏడాది మే 29న తీసుకొచ్చారు. రెయిన్‌బో ఆస్పత్రి సమీపంలో ఆటోను నిలిపి రామచంద్రారెడ్డి హాస్పిటల్‌కెళ్లారు. తిరిగొచ్చేసరికి అదృశ్యమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేత్రపర్వంగా గిరి ప్రదక్షిణ



నెల్లూరు సిటీ: నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామివారికి గరుడసేవను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిప్రదక్షిణను జరిపారు. ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కాత్యాయని వ్రతం



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో గల అనివెట్టి మండపంలో కాత్యాయని వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు రఘురామ్మూర్తి ఆధ్వర్యంలో జరిపారు. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

చలో విజయవాడ జయప్రదం



నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమం విజయవంతమైందని ఫ్యాప్టో నేతలు తెలిపారు. జిల్లా నుంచి అధిక సంఖ్యలో హాజరయ్యారని చెప్పారు. మధ్యాహ్న భోజనం మినహా ఎలాంటి యాప్‌లో నమోదు చేయకూడదని తీర్మానం చేశామని వివరించారు.

చీఫ్ జస్టిస్‌పై దాడికి యత్నం దారుణం


సీపీఎం నేతల నిరసన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): చీఫ్ జస్టిస్ గవాయ్‌పై న్యాయవాది దాడికి యత్నించడాన్ని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యుడు నాగేశ్వరరావు ఖండించారు. ఈ మేరకు నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో నిరసనను పార్టీ నెల్లూర నగర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. నేతలు సూర్యనారాయణ, నరసింహ, కత్తి పద్మ, శ్రీనివాసులు, రషీద్, చిరంజీవి, చెంగయ్య, ఏమేలు తదితరులు పాల్గొన్నారు.

⇨ ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిరసనను సీపీఎం నెల్లూరు రూరల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు, కొండా ప్రసాద్, పెంచలనరసయ్య, అబ్దుల్ అజీజ్, సతీష్, సుధాకర్, కోటేశ్వరరావు, మాలకొండయ్య, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

⇨ నగరంలోని జిల్లా కోర్టు ఆవరణలో నిరసనను కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో చేపట్టారు. పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

⇨ చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించిన న్యాయవాదిని దేశ బహిష్కరణ చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర కిశోర్ డిమాండ్ చేశారు. సంతపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. నేతలు సిరాజ్, షానవాజ్, శిరీషా, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారులు జలమయం


నీటమునిగిన మారుతినగర్‌లోని మొదటి వీధి

నెల్లూరు(బారకాసు): నగరంలో వర్షం మంగళవారం కురవడంతో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. నీటి ప్రవాహానికి వాహనదారులు, పాదచారులు అనేక పాట్లు పడాల్సి వచ్చింది. పలు ప్రాంతాల్లోని వీధులు, కాలనీలు నీటమునిగాయి. విజయమహల్ గేట్, రామలింగాపురం, మాగుంట లేఅవుట్ అండర్ బ్రిడ్జిల్లో నీరు చేరింది. ప్రత్యేక మోటార్ల ద్వారా నీటిని తొలగించే పనులను కార్పొరేషన్ సిబ్బంది చేపట్టారు. నగరంలోని డ్రెయిన్లు, మ్యాన్‌హోల్స్, కాలువలు పొంగి పొర్లుతున్నాయి. సండే మార్కెట్ ప్రాంతంలో మురుగు ప్రవహించింది. పొగతోట, స్టోన్‌హౌస్‌పేట, పెద్దబజార్, చిన్నబజార్, ఆచారివీధి, లీలామహల్‌రోడ్డు, మద్రాస్ బస్టాండ్, ఆర్టీసీ, ఫతేఖాన్‌పేట, ఎన్టీఓ కాలనీ, దర్గామిట్ట, రామలింగాపురం, రామ్మూర్తినగర్, బాలాజీనగర్, నవాబుపేట, జనార్దన్‌రెడ్డికాలనీ, భగత్‌సింగ్ కాలనీ, మెక్లిన్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

ఉద్యోగులకు తీరని అన్యాయం


నూతన కార్యవర్గం

నెల్లూరు(అర్బన్): కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఉద్యోగులకు తీరని అన్యాయం జరుగుతోందని యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు నరమాల సతీష్ కుమార్ ఆరోపించారు. దర్గామిట్టలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన యూనియన్ జిల్లా మహాసభలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఆశలతో ఓట్లేసి గెలిపించిన ఉద్యోగులపై కక్షసాధింపు చర్యలకు కూటమి ప్రభుత్వం పాల్పడుతోందని విమర్శించారు. పీఆర్సీ కమిషన్‌ను వేయలేదని.. ఐఆర్‌ను ప్రకటించలేదని.. ఒక్క డీఏనూ విడుదల చేయకుండా నిరంకుశంగా వ్యవహరిస్తోందని చెప్పారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా విజయవాడలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో టీచర్లు చేపట్టిన ఆందోళన విజయవంతమైన నేపథ్యంలో, ఇప్పటికైనా తమ తప్పులను తెలుసుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించే యోచనను విరమించుకోవాలని కోరారు. ప్రభుత్వాస్పత్రుల్లో మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు గానూ ప్రత్యేక బడ్జెట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే ఐక్య ఆందోళనలకు శ్రీకారం చుడతామని స్పష్టం చేశారు.

నూతన కమిటీ ఎన్నిక

యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఉస్మాన్, సందానీబాషా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శేషయ్య, ఉపాధ్యక్షులుగా పార్థసారథి, రసూల్, పెంచలయ్య, సహాయ కార్యదర్శులుగా హరి, జబ్బార్ తదితరులను ఎన్నుకున్నారు.

సోలార్ విద్యుత్‌పై విస్తృత ప్రచారం చేయాలి


మాట్లాడుతున్న రాఘవేంద్రం


హాజరైన అధికారులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సోలార్ విద్యుత్‌పై క్షేత్రస్థాయిలో ప్రచారం కల్పించాలని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ రాఘవేంద్రం ఆదేశించారు. జిల్లాలోని అన్ని డివిజన్లకు చెందిన ఈఈలు, డీఈఈలు, సోలార్ వెండార్లతో నగరంలోని విద్యుత్ భవన్‌లో గల స్కాడా సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ఇప్పటి వరకు 7803 దరఖాస్తులు రాగా, 2210 మందికి సోలార్ ప్యానళ్లను కేటాయించగా, వీరిలో 1873 మంది సబ్సిడీని పొందారని తెలిపారు. లక్ష్యాలను నిర్దేశించుకొని సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. సూర్యఘర్ జిల్లా నోడల్ అధికారి శేషాద్రిబాలచంద్ర, ఈఈలు శ్రీధర్, సోమశేఖర్‌రెడ్డి, రమేష్‌చౌదరి, బెనర్జీ, భానూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి సీఎం చేయడమే లక్ష్యం


మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో యువతను భాగస్వాములను చేసి, జగనన్నను మరోసారి సీఎంను చేయడమే లక్ష్యంగా సమష్టిగా కృషి చేద్దామని పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. రామ్‌జీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో నగర నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులతో మంగళవారం నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. అనుబంధ సంఘాల అధ్యక్షులు.. డివిజన్ ఇన్‌చార్జిలను సమన్వయం చేసుకొని నియోజకవర్గంలో పార్టీ నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



నెల్లూరు(అర్బన్): పరిశుభ్రతతో వ్యాధులను దూరం చేయొచ్చని జిల్లా సహాయ మలేరియా నివారణాధికారి నాగార్జునరావు పేర్కొన్నారు. ఆశ దినోత్సవాన్ని పురస్కరించుకొని రైతుబజార్ రోడ్డులోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం పరిశుభ్రత ఎంతో ముఖ్యమని చెప్పారు. దోమలు కుట్టకుండా చూసుకుంటే డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికున్‌గన్యా లాంటి వ్యాధులు రావని తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి మిస్బాసుల్తానా, హెల్త్ సిబ్బంది శ్యామ్‌సన్‌బాబు, కరుణమ్మ, వరప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురం సెక్టార్‌లోని వెంకటేశ్వరపురం – 7 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. వివిధ అంశాలపై సూపర్‌వైజర్ రత్నమ్మ అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు పద్మజ, పద్మ, ఆయాలు లక్ష్మి, చెంచులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ విభాగ కమిటీల నిర్మాణంపై సమీక్ష



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగ కమిటీల నిర్మాణంపై సమీక్ష సమావేశాన్ని నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పందిటి కామరాజు ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎస్సీ విభాగ కమిటీలను పూర్తి స్థాయిలో నియమించనున్నామని వెల్లడించారు. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయడమే లక్ష్యంగా ఏకతాటిపైకి రావాలని కాంక్షించారు.

తాగునీరివ్వాలంటూ నిరసన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నామంటూ స్థానిక మున్సిపల్ కార్యాలయ ఎదుట నిరసనను పాత కాశీపాళెం పీర్ల చావిడి వీధి ప్రాంత ప్రజలు మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడారు. తాగేందుకు నీరు లేక రెండు రోజులుగా ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. కట్టుబడిపాళెం నుంచి నీళ్ల ట్యాంకర్ రావడంలేదని, సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఎస్జీఎఫ్ ఎంపికలు రేపు

ఇందుకూరుపేట: మండల స్థాయి ఎస్జీఎఫ్ టోర్నీ, ఎంపికలను కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించనున్నామని ఎంఈఓ సునీల్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడారు. అండర్ – 14, 17 విభాగాల్లో బాలబాలికలకు కబడ్డీ, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్ పోటీలను కొత్తూరులో నిర్వహించనున్నామని వివరించారు. అథ్లెటిక్స్, ఖోఖో ఎంపికలను పల్లిపాడులో శుక్రవారం జరపనున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు తగిన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని, వివరాలకు కొత్తూరు పీడీ అరోరాను సంప్రదించాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పొదలకూరు: సీజనల్ వ్యాధులపై ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, ఆశ వర్కర్లు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ సూచించారు. ఆశ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని మహ్మదాపురం పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర జ్వరాలొచ్చే అవకాశం ఉందన్నారు. కీటక జనిత వ్యాధుల గురించి ముందస్తుగా తెలుసుకుని జాగ్రత్తలు పాటించాలన్నారు. వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలని సూచించారు. పరిశుభ్రమైన నీటిని తాగితే అంటు వ్యాధులు రావని పేర్కొన్నారు. పబ్లిక్ హెల్త్ నర్స్ వరలక్ష్మి, సబ్‌యూనిట్ అధికారి ఆంజనేయవర్మ, ఆరోగ్య పర్యవేక్షకులు మస్తాన్‌బీ, నరసమ్మ పాల్గొన్నారు.

పాతకక్షలతో దాడి

నెల్లూరు సిటీ: పాతకక్షలను మనస్సులో పెట్టుకొని కత్తులు, రాడ్లతో కొందరు వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటనపై కేసును నెల్లూరు రూరల్ పోలీసులు మంగళవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. పొట్టేపాళెంలోని ఇటుక బట్టీ సమీపంలో నివాసం ఉంటున్న మాణికల మణి కాగితాలను ఏరుకొని జీవనం సాగిస్తున్నారు. కాగితాలు ఏరుకునే విషయంలో గుబ్బా శ్రీరాములు, మరో వ్యక్తితో గతంలో గొడవ జరిగింది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా, మందలించి పంపారు. ఈ తరుణంలో మణి తన స్నేహితులైన చిన్నా, లక్ష్మయ్యతో కలిసి పొట్టేపాళెంలో ఆదివారం నిద్రిస్తుండగా, కత్తులు, రాడ్లతో ముగ్గురు వ్యక్తులు దాడికి పాల్పడి పరారయ్యారు. గాయపడిన వారిని జీజీహెచ్‌లో చేర్పించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.